ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 21 ఆగస్టు 2025



కలిసికట్టుగా మంతనాలు

ఖరారైన కొత్త మద్యం పాలసీ

- 2025-27 కాలపరిమితితో ఎక్సైజ్ మార్గదర్శకాలు
- దరఖాస్తు రుసుము రూ.3 లక్షలకు పెంపు
- జిల్లాలోని 48 మద్యం దుకాణాల్లో 34 జనరల్ రిజర్వేషన్
- ఎస్సీ, గౌడ సామాజిక వర్గాలకు 14 దుకాణాలు రిజర్వ్
- టెండర్లు దక్కించుకునేందుకు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కొత్త మద్యం పాలసీ ఖరారైంది. 2025-27 సంవత్సరానికి సంబంధించిన మద్యం టెండర్ల ప్రక్రియకు బుధవారం ఎక్సైజ్ శాఖ కొత్త పాలసీని జారీ చేసింది. లైసెన్స్ కాలం 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు నిర్ణయించారు. ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీచేయడంతోనే రాజన్న సిరిసిల్ల జిల్లాలో మద్యం వ్యాపారులు కలిసికట్టుగా టెండర్లను దక్కించుకునే విధంగా మంతనాలు ప్రారంభించారు. జిల్లాలో కొత్త మద్యం కిక్కు కోసం సిండికేట్‌గా మారడానికి సిద్ధమవుతున్నారు. టెండర్లు దక్కించుకోవడానికి గౌడ, ఎస్సీ సామాజిక వర్గాలను కూడా సిండికేట్‌లో భాగస్వామ్యం చేయడానికి సిద్ధమవుతున్నారు. మద్యం టెండర్ వస్తే భారీగా ఆదాయం సమకూరుతుందనే భ్రమలో లక్షలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. మళ్లీ ఈసారైనా టెండర్ దక్కుతుందనే ఆశతో మరోసారి సిద్ధపడుతున్నారు.

గతంలో దరఖాస్తుల రుసుంతో రూ.40.72 కోట్ల ఆదాయం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత లైసెన్స్ పీరియడ్‌లో 48 దుకాణాలకు కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. 2023-25 కాలానికి సంబంధించి మద్యం వ్యాపారులు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. 2023 ఆగస్టులో జరిగిన టెండర్లలో 2,036మంది దరఖాస్తులు చేసుకోగా 150మంది మహిళలు ఉన్నారు. దరఖాస్తు రుసుము రూ.2లక్షలు ఉండడంతో ఎక్సైజ్ ఖజానాకు జిల్లా నుంచి రూ.40.72 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తు ఫీజు పెరిగింది. గతంలో రూ.రెండు లక్షలు ఉండగా ఈసారి మూడు లక్షలకు పెంచారు.

ఆరు స్లాబ్‌లో లైసెన్స్ ట్యాక్స్

మద్యం దుకాణాలను 2011 జనాభా లెక్కల ప్రకారం ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం జనాభా లెక్కలు జరుగలేదు కాబట్టి మద్యం దుకాణాలు పెరిగే అవకాశం లేదు. 5వేల జనాభా ఉన్న ప్రాంతాలకు లైసెన్స్ టాక్స్ రూ.50 లక్షలు, 5 నుంచి 50వేల వరకు జనాభా ఉంటే రూ 55లక్షలు, 50వేల నుంచి లక్ష జనాభా వరకు రూ60 లక్షలు, లక్ష నుంచి 5 లక్షల వరకు జనాభా ఉంటే రూ 65 లక్షలు, 5లక్షల నుంచి 20లక్షల వరకు రూ 85లక్షల ట్యాక్స్ వసూలు చేస్తారు. 20 లక్షలపైన జనాభా ఉంటే రూ.1.10 కోట్లు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. డ్రా పద్ధతి ద్వారా దుకాణాలు కేటాయిస్తారు. డిసెంబర్ 1, 2025 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభమవుతాయి.

జిల్లాలో ఇప్పటివరకు మద్యం విక్రయాలు రూ.837 కోట్లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మద్యం అమ్మకాల ద్వారా ఎక్సైజ్ శాఖకు..

మిగతా 8లో..

రిజర్వేషన్లు, ఎంపిక ప్రక్రియ ఇలా..

మద్యం దుకాణాలు కేటాయింపుల్లో రిజర్వేషన్ ప్రక్రియ ఉంటుంది. గౌడ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ప్రకారం దుకాణాలను కేటాయిస్తారు. గౌడ సామాజికవర్గానికి 15 శాతం, ఎస్సీ వర్గానికి 10 శాతం, ఎస్టీలకు 5 శాతం షాపులను కేటాయించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 48 మద్యం దుకాణాలు ఉండగా, ఇందులో నిబంధనలకు అనుగుణంగా ఎస్టీలో జనాభా లేకపోవడంతో గౌడ, ఎస్సీలకు దుకాణాలు కేటాయించారు. 34దుకాణాలు జనరల్ కేటగిరిలో ఉండగా, గౌడ సామాజికవర్గానికి 9 దుకాణాలు, ఎస్సీలకు ఐదు దుకాణాలు రిజర్వ్ చేసి టెండర్లు పూర్తిచేశారు. ఈసారి రిజర్వేషన్లలో దుకాణాలు మారుతాయని భావిస్తున్నారు. ఈసారి మద్యం దుకాణానికి ఒకటి కంటే ఎక్కువగా దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మహేశ్ బి గీతే



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి గీతే

ముస్తాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వర్షాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మహేశ్ బీ గితే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీసు ఠాణాను ఎస్పీ బుధవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులు తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. పెట్రోలింగ్ సమయంలో పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను ప్రతిరోజు తనిఖీ చేయాలని ఆదేశించారు. వర్షాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని వరద ప్రవాహంతో ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య వరద ప్రవాహం ఎక్కువ ఉండి రాకపోకలకు ఇబ్బంది తలెత్తగా స్థానిక ఎస్సై రమాకాంత్‌తో కలిసి పరిశీలించి అటువైపు ఎవరూపోకుండా ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, అవసరం మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గణేశ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖ రూపొందించిన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీహెచ్ గణేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు పాటుపడాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మర్రిగడ్డలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా సమర్థవంతంగా పనిచేసి భారత దేశంలో నూతన టెక్నాలజీని ప్రవేశపెట్టారన్నారు. గ్రామ పంచాయతీలకు నేరుగా ఢిల్లీ నుంచి నిధులు వచ్చేలా చేశారన్నారు. ప్రపంచానికి యువత వెన్నుముకని ఆనాడే గుర్తించి యువతకు 18 సంవత్సరాలకే ఓటుహక్కు కల్పించారన్నారు. ఆయన నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబడిందన్నారు. నేటి యువతరం ఆయన ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ బాటలో రాహుల్‌గాంధీ నడుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, దూది శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణ, ఇందూరి మధు, మ్యాకల గణేశ్, సత్యనారాయణ రెడ్డి, పులి సత్తయ్య, పాల్గొన్నారు.

సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలి



సైకిళ్లను పంపిణీ చేస్తున్న గోపి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు మోదీ కానుకగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అందజేస్తున్న సైకిళ్లను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు బండి సంజయ్ కేటాయించిన సైకిళ్లను విద్యా శాఖ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణహరి, హెచ్ఎం మధుమాలతి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు గణేశ్, నరేశ్, ప్రకాశ్, కిరణ్‌నాయక్, బాలగౌడ్, సత్యంరెడ్డి, రాజు, బాపురెడ్డి, యాదగిరి, లక్ష్మారెడ్డి, శ్రీశైలం, కృష్ణహరి, రంజిత్‌కుమార్, రవీందర్, నవీన్, ప్రశాంత్, సత్తయ్య, సతీష్, మధు, రాకేశ్, గణేశ్ నాయక్, రమేశ్‌నాయక్, ప్రవీణ్, పూర్ణిమ, తేజశ్రీ, జ్యోతి, మంజుల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమయానికి ఆర్టీసీ బస్సులు నడిపించాలని ఆందోళన

- విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకుల రాస్తారోకో



విద్యార్థులతో కలిసి ధర్నా, రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యా సంస్థల సమయానికి ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోని నాయకులు విద్యార్థులతో కలిసి బుధవారం వీర్నపల్లి మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. స్థానిక ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆర్టీసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేక తరగతులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోతోందని వాపోయారు. అటవీ గ్రామాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వచ్చేంతవరకు ఇక్కడ నుంచి కదలబోమని తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని నిరసనకారులను శాంతింపజేయడానికి యత్నించారు. పోలీసులు, నాయకులు, విద్యార్థుల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు చేరుకున్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోనులో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్‌కుమార్, విద్యార్థులు ప్రవీణ్, దివ్య, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

కూలి పెంపుపై యజమానులు స్పందించాలి

- టెక్స్‌టైల్ పార్క్‌లో రెండో రోజుకు చేరిన కార్మికుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

తంగళ్లపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : టెక్స్‌టైల్ పార్క్‌లలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కూలి పెంపుపై యాజమానులు మొండి వైఖరిని వీడి స్పందించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్ పార్క్‌లో కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారంతో రెండో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా పార్క్‌లో చేపట్టిన సమ్మె శిబిరాన్ని మూషం రమేష్ సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత జౌళిశాఖ అధికారులు జోక్యం చేసుకుని వెంటనే కార్మికులకు కూలి పెంచే విధంగా యజమానులతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమ్మెలో టెక్స్‌టైల్ పార్క్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూచన శంకర్, వేణు, సంపత్, కనకయ్య, వరప్రసాద్, శ్రీనివాస్, రాజు, శ్రీకాంత్, కిషన్, రమేష్, నరేష్, శ్రీధర్, వెంకటేశం, అంబదాస్, నర్సయ్య పాల్గొన్నారు.

ఉపఎన్నికల్లో ప్రచారం చేయించుకోవడం వ్యాపారమా?

- కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మునుగోడు ఉప ఎన్నికలలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా సిరిసిల్లకు చెందిన పద్మశాలి సంఘం నాయకులు, కుల పెద్దలు,వస్త్రవ్యాపారులతో ప్రచారం చేయించుకోవడం వ్యాపారమా.. రాజకీయమా కేటీఆర్ చెప్పాలని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఎల్లప్ప మాట్లాడారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో పద్మశాలి వస్త్ర వ్యాపారస్తులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడాడన్నారు. వ్యాపారులు చేసుకోకుండా రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారని, వ్యాపారాలు చేసుకునే వారిని మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రచారం చేయించుకోవడం వ్యాపారమా... రాజకీయమా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా గ్రహించాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్ల నియోజకవర్గంలో కేటీఆర్ ఎమ్మెల్యే పోటీ చేస్తుండగా బతుకమ్మ చీరల బకాయిలు రూ.350కోట్లు ఆపి సిరిసిల్ల వస్త్రవ్యాపార సంఘాలు, వ్యాపారులకు మార్కండేయ కండువాతోపాటు బీఆర్ఎస్ కండువా వేయించి ప్రచారం చేయించుకొని కేటీఆర్‌ను గెలిచాడని ఆరోపించారు. బతుకమ్మ చీరలకు ఏడు సంవత్సరాలు ఆర్డర్ ఇచ్చానని కేటీఆర్ మాట్లాడారని, వాటితో దొరలే లాభం పొందారన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ వెంగళ లక్ష్మీనర్సయ్య, అన్నల్‌దాస్ భాను, దేవదాస్, గోరింట్యాల లక్ష్మీపతి, గాజుల నరేష్, మార్గం లక్ష్మణ్, సబ్బని వేణు, వంగరి దత్తు, సత్యనారాయణ, దేవరాజు, రాఘవులు, శంకర్ పాల్గొన్నారు.

పాడి పశువులతో ఆర్థికంగా వృద్ధి చెందాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా 8

ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి 8

మానేరు జలాలకు కలెక్టర్, ఎస్పీ పూజలు



మానేరు జలాలకు పూజలు చేస్తున్న కలెక్టర్, ఎస్పీ



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి వెళుతున్న నీరు

గంభీరావుపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పూర్తిగా నిండటంతో బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ గీతేతో కలిసి మానేరు జలాలకు పూజలు నిర్వహించారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 2 టీఎంసీలు కాగా, నిండటంతో ప్రాజెక్టును కలెక్టర్, ఎస్పీ, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలు పరిశీలించారు. ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. ఎగువ మానేరు ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో తదితర వివరాలను నీటి పారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 9500 క్యూసెక్కుల నీరు వస్తోందని, అదే స్థాయిలో కిందికి వదులుతున్నామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రజలను అప్రమత్తం చేస్తూ నీటిని వదలాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటిపారుదల శాఖ అధికారి కిషోర్, డీఈ నార్సింగ్, డీవీహెచ్‌వో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో రాజేందర్ తదితరులు ఉన్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండోరోజు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండోరోజు బుధవారం నీటి ఎత్తిపోతలు కొనసాగాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.06 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా 3200 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఒక పంప్ ద్వారా అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మధ్యమానేరులో నీరు పెరిగితే రెండు పంప్‌ల ద్వారా నీటిని ఎత్తిపోస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి నీటితో పాటు, మూలవాగు, మానేరు ద్వారా నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు 17152క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 13802, గాయత్రి పంప్ హౌస్ నుంచి 3150 క్యూసెక్కులు, మూలవాగు, మానేరువాగు ద్వారా 200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.17 మీటర్లు ఉండగా, నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 14.89 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.



వరద కాలువ నుంచి మిడ్ మానేరుకు వెళుతున్న నీరు

యూరియా కోసం రైతుల ఆందోళన



రాచర్లబొప్పాపూర్‌లో గూమికూడిన రైతులు



గంభీరావుపేటలో యూరియా కొరతపై రోడ్డెక్కిన రైతులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో యూరియా కోసం బుధవారం రైతులు బారులు తీరారు. వేకువజాము నుంచే భారీ సంఖ్యతో తరలివచ్చారు. గంటల తరబడి నిరీక్షించారు. లారీలో 460 యూరియా బస్తాలు రావడంతో పేర్లను నమోదు చేయించుకునేందుకు ఎగబడ్డారు. ఒక్కో రైతుకు ఒక బస్తాను మాత్రమే అందజేశారు. 240 యూరియా బస్తాలు పంపిణీ చేశారు. గ్రామానికి యూరియా వచ్చిందనే సమాచారంతో రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం భర్త గౌస్ అక్కడికి చేరుకుని లారీలో ఉన్న మిగతా సంచులను ఇతర గ్రామానికి తీసుకెళ్లేందుకు సిద్ధమవడంతో రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహించారు. తమ గ్రామానికి వచ్చిన యూరియాను ఎలా తీసుకెళ్తారని నిలదీశారు. ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకుని రైతులందరికీ పంపిణీ చేసేలా చూస్తామని పేర్కొనడంతో శాంతించారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో యూరియా కొరతపై బుధవారం రైతులు రోడ్డెక్కారు. తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కామా రెడ్డి-సిద్దిపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ మారుతిరెడ్డితో పాటు పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. ఉన్నతాధికారులతో తహసీల్దార్ మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి మద్దతు తెలిపి రాస్తారోకోలో పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన వృద్ధురాలి హత్య


పెగుడ మల్లవ్వ(ఫైల్)

గంగాధర/గంభీరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కిడ్నాపైన గంగాధర మండల కేంద్రానికి చెందిన పెగుడమల్లవ్వ(70)ను దుండగులు హత్య చేశారు. ఎస్సై వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల16న మల్లవ్వను ఇంటి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. మరుసటి రోజున మల్లవ్వ తమ్ముడు ఈరవేణి రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌కు చెందిన గంగరాజు మల్లవ్వను కిడ్నాప్ చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా కొత్తపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన దేవునూరి సతీష్, దేవునూరి శ్రావణ్ గంగరాజు సూచనల మేరకు ఈనెల 16న మల్లవ్వను కారులో ఎక్కించుకుని కిడ్నాప్‌చేశారు. మల్లవ్వను గంభీరావుపేట మండలశివారులోని పెద్దమ్మ స్టేజివద్ద అడవిలో హత్యచేసి ఆమె పైన ఉన్న బంగారు ఆభరణాలు, నగదును దోచుకుని మృతదేహాన్ని చెత్త కుప్పలో పడేశారు. మల్లవ్వను కిడ్నాప్ చేసే సమయంలో కారు నంబర్‌కనిపించకుండా స్టిక్కర్లు అతికించి దుండగులు జాగ్రత్తపడ్డారు. నిందితుల సెల్‌ఫోన్‌లను ట్రాప్‌చేసి పట్టుకోగా హత్యానేరాన్ని ఒప్పుకున్నారు. హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడైన గంగరాజుతోపాటు మరికొందరు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు వేవునూరి శ్రావణ్‌పై గతంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో గంజాయి, కొట్లాట కేసులు ఉన్నాయి. ఇద్దరు నిందితుల వద్ద నుంచి రెండుసెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమా వేశంలో కరీంనగర్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్సై వంశీకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్‌పత్తి ధరరూ.7600 పలికింది. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 18క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

మహారాష్ట్ర వరదలో చిక్కుకున్న గోదావరిఖని వాసులు

కోల్‌సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికిచెందిన మామిడి కుమార్ కుటుంబం మహారాష్ట్ర వరదల్లో చిక్కుకుంది. మందమర్రి, మంచిర్యాలకు చెందిన నలుగురుమిత్రుల కుటుంబాలు, కుమార్ కుటుంబం మినీ బస్సులో కర్ణాటక, మహారాష్ట్ర టూర్‌కు వెళ్లారు. ఈనెల11న కర్ణాటకకు వెళ్లిన వీరు 18నగోవా నుంచి బయలు దేరి మహారాష్ట్రకు చేరుకున్నారు. కొల్హాపూర్ సమీపంలోని గగన్‌భవాడివద్ద వరద తీవ్రతకు మంగళవారం నుంచి వాహనాలు నిలిచిపోయాయి. మూడురోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో పోలీసులు వాహనాలు నిలిపివేశారు. దీంతో మంచిర్యాల జిల్లాకు చెందిన వారు సెల్ఫీవీడియో ద్వారా ప్రభుత్వ యంత్రానికి విన్నవించారు. వారిని మంగళవారం రాత్రి చిన్నషెడ్‌లో ఉంచిన పోలీసులు బుధవారం ఇతర మార్గాలనుంచి పంపించే యత్నం చేయగా మళ్లీ బస్సు వరదలో చిక్కుకున్నట్టు బాధితులు పేర్కొంటున్నారు. వరదలు తగ్గితే కానీ పంపించే అవకాశం లేదని పోలీసులు పేర్కొంటున్నట్టు తెలిపారు.

వినాయక విగ్రహాన్ని తాకిన విద్యుత్ తీగలు

- రోడ్డుపైనే అరగంట ఆగిన వాహనం


విద్యుత్ తీగలు అడ్డు రావడంతో ఆగిన ట్రాక్టర్

ఎండపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో రోడ్డుపైనే ట్రాక్టర్ అరగంట పాటు ఆగింది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన యూత్ సభ్యులు కోరుట్ల నుంచి వినాయకుడిని ట్రాక్టర్‌పై స్వగ్రామానికి తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో కొత్తపేట రహదారిపై వినాయక విగ్రహానికి తీగలు తట్టడాన్ని గమనించిన యూత్ సభ్యులు అప్రమత్తమై వాహనాన్ని అక్కడే ఆపి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో విద్యుత్ సిబ్బంది కరెంట్ ఎల్‌సీ తీసుకోవడంతో ట్రాక్టర్ ముందుకు కదిలింది. వినాయక నిమ జ్జనం నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు ముందస్తుగా స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్



- ఆయకట్టు రైతుల్లో ఆనందం
- ఇప్పటికే ప్రాజెక్టు గేట్లు తెరిచి దిగువకు నీరు
- కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు

ప్రస్తుత పరిస్థితి ఇలా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 2,07,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 68.065 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 1,31,867 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 25 వరద గేట్ల ద్వారా 1,02,850 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,000 క్యూసెక్కులు, వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 636 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన గేట్లను పైకి ఎత్తి దిగువ గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో సాగు, తాగు నీటికి ఇబ్బందులు దూరం కానున్నయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులు, మత్స్యకారుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి అధికంగా వరద నీరు వచ్చి చేరుతోంది.

మరమ్మతులకు నోచుకోని కాలువలు

కాకతీయ ప్రధాన కాలువ లైనింగ్ పలు ప్రాంతాల్లో పగుళ్ల తేలింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, బీమారం, జగిత్యాల రూరల్, మల్యాల, కొడిమ్యాల మండలాల్లో ప్రవహించే ఈ కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం శ్రీరాంసాగర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో వానాకాలంతో పాటు యాసంగిలోనూ పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. కాకతీయ కాలువ ఉప కాలువలకు తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. పలు ప్రాంతాల్లో కాలువ లైనింగ్ దెబ్బతినడం, పిచ్చి మొక్కలు పెరగడం, పూడికతీత పేరుకపోవడం వంటి సమస్యలున్నాయి. ఎస్సారెస్పీలో పుష్కలంగా నీరు ఉండడంతో జగిత్యాల జిల్లాలోని గోదావరి తీరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్ తదితర మండలాల్లో గల ఎత్తిపోతల పథకాల కింద సాగయ్యే పంటలకు నీరందే అవకాశం ఉంది.


కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

వరద కాలువ, కాకతీయ కాలువల ద్వారా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరుగుతుండడంతో వరద కాలువ, కాకతీయ కాలువ ద్వారా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువకు మొదట రెండు వేల క్యూసెక్కుల నుంచి పెంచి చివరకు 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల పెంచి వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4 వేల నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగు, తాగు నీటి కష్టాలు తీరినట్లే..

ప్రస్తుత యేడాది జూన్ ఒకటో తేదీ నుంచి ఈనెల 19వ తేదీ ఉదయం 6 గంటల వరకు 82.683 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ప్రాజెక్టులో అవసరాల మేరకు నిల్వ చేసి మిగులు నీటిని సుమారు 22.026 టీఎంసీలను సాగునీటి కాలువలు, గోదావరి నది దిగువకు వదిలారు. ఈనెల రెండో తేదీ నుంచి ఐదో తేదీ వరకు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈనెల 17 నుంచి మిగులు నీటి విడుదల జరుగుతోంది. ప్రాజెక్టు కింద కాకతీయ, సరస్వతీ, లక్ష్మీ, వరద కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాల కింద సుమారు 7.5 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నారు.

పాముకాటుతో రైతు మృతి


రమేష్(ఫైల్)

చిగురుమామిడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామా నికి చెందిన మేడబోయిన రమేష్ (40) అనే యువ రైతు తన వ్యవసాయబావి వద్ద మంగళవారం ఉదయం పాముకాటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రోజువారి కార్యక్రమంలో భాగంగా రమేష్ వ్యవసాయ పనులు చేసేం దుకు ఉదయం పొలం గట్టుపైనుంచి నడుస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికే పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామమాజీ ఎంపీటీసీ తిరుపతి తెలిపారు.

మహిళను కాటు వేసిన పాము

శంకరపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలో మహిళ పాము కాటుకు గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల గ్రామానికి చెందిన చర్ల రేణుక తన భర్త కోటయ్యతో కలిసి వ్యవసాయ పొలంలో వరికలుపు తీస్తోంది. ఈక్రమంలో అకస్మాత్తుగా పాము వచ్చి ఆమె చేయిపై కాటేసింది. గమనించిన కోటయ్య వెంటనే 108కు సమాచారం అందించారు. 108 వాహనం సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకొని రేణుకకు ప్రథమచికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ స్టేజి సమీపంలో ఈనెల18న రాత్రి ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న విషయం విదితమే. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా రోడ్డు పక్కకు పెట్టించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఆ కారుకు సంబంధించి ముందు, వెనకల ఉన్న నాలుగు టైర్లను దొంగిలించుకొని పోయారు. దీన్ని స్థానికులు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. కారు టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకుంటాం

- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్


వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయిస్తున్న కమిషనర్ మహమ్మద్ అయాజ్

జమ్మికుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్‌ప్లాంట్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఓ వాటర్ ప్లాంట్‌ను అధికారులతోకలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటర్‌ప్లాంట్ అపరిశుభ్రంగా ఉండటం, క్యాన్లలోపురుగులు ఉండటాన్ని గమనించి ఆగ్రహంవ్యక్తం చేసి సీజ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లలోని క్యాన్లను మూడు నెలలకు ఒకసారి మార్చాలన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలో 25 వాటర్ ప్లాంట్లు ఉన్నాయని, విడుతల వారీగా అన్నింటినీ తనిఖీ చేస్తామన్నారు.

గణేష్ స్టోర్స్‌కు జరిమానా..

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్‌లో గల గణేష్ జనరల్‌స్టోర్స్‌ను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. అల్లం పేస్ట్ డబ్బాలపై ఎలాంటి స్టిక్కర్లు లేకపోవడాన్ని గమినించి మందలించారు. బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లు విక్రయించడంపై జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సోదరుడు రాజేశం మృతి


రోదిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు (చిన్న అన్నయ్య) కవ్వంపల్లి రాజేశం బుధవారం మృతిచెందారు. ఆంధ్ర బ్యాంకులో ఉద్యోగం చేసిన కవ్వంపల్లి రాజేశం ఏడేళ్ల కిందట ఉద్యోగవిరమణ పొందారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో 20 రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్యుల సూచన మేరకు చివరి దశలో కరీంనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు పరామర్శించారు. కవ్వంపల్లి రాజేశం అంతిమ యాత్రలో జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనేతలు, మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగం కల్పించేలా విద్యార్థులు ఎదగాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్

రామగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం సాధించేవిధంగా కాకుండా పలువురికి ఉద్యోగం కల్పించే లక్ష్యంతో విద్యార్థులు ఎదగాలని జెఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(అలీప్)ఆధ్వర్యంలో ప్రపంచబ్యాంకు నిధులతో భారతప్రభుత్వం నిర్వ హిస్తున్న రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ అండ్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహాపరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ)స్థాపనలో భాగంగా తెలంగాణప్రభుత్వం పరిశ్రమలశాఖ, జిల్లా గ్రామీణఅభివృద్ధిసంస్థ సంయుక్తంగా మంథని జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ ప్రొఫెసర్ ఆర్ శ్రీదేవి నేతృత్వంలో జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో యువ అంకుర సంస్థలకు, ఔత్సాహికులకు అవగాహన కల్పించారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కిషన్ కుమార్‌రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసదస్సుకు హాజరైన250మంది విద్యార్థులకు 15రోజులపాటు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ప్రభుత్వం ఫడింగ్ స్కీంల, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అలీప్ డైరెక్టర్ కన్నెంటి రమాదేవి, చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ జహరుల్లా, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్,మేనేజర్ నవీన్‌కృష్ణ,సాజీద్,వంశీ,కావ్యతదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్ర్కాప్ బస్సును ఢీకొన్న లారీ

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీ వద్ద రాజీవ్ రహదారి వద్ద నిలిపి ఉంచిన ఆర్టీసీస్ర్కాప్ బస్సు(పాడైన, పనికి రాని)ను లారీ ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కిచెందిన వారు స్ర్కాప్‌లో 4 ఆర్టీసీబస్సులను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళుతున్నారు. ఒకస్ర్కాప్ బస్సు డ్రైవర్ రామకృష్ణ కాలనీ వద్ద బుధవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన టీ తాగేందుకు ఆపాడు. ఈ క్రమంలో కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న లారీ, బస్సును ఢీ కొంది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకువెళ్లింది. బస్సు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

వరకట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య


భావన(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భర్తతో పాటు అత్తింటివారి వరకట్నం వేధింపులు భరించలేక కరీంనగర్‌లో నివాసం ఉంటున్న కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేటకు చెందిన భావన అలియాస్ మానస(26)మంగళవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి, పోలీసులవివరాల ప్రకారం.. సోమార్‌పేటకు చెందిన భావన అలియాస్ మానసకు గాంధారి మండలం పేట్‌సంగెం గ్రామానికి చెందిన అబ్రం జ్ఞానేశ్వర్‌తో 2023నవంబరులో వివాహమైంది. వీరికి 6నెలల కూతురు ఉంది. వివాహసమయంలో 16తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, ఇతరలాంఛనాలు అత్తింటివారికి ముట్టజెప్పారు. అబ్రం జ్ఞానేశ్వర్ కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో కెప్టెన్‌గా పనిచేస్తూ భార్య, కూతురుతో కలిసి స్థానిక భగత్‌నగర్‌లో అద్దెఇంటిలో ఉంటున్నాడు. ఏడాది నుంచి భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనపుకట్నం తేవాలంటూ భావనను మానసికంగా వేధిస్తున్నారు. తండ్రి ఆస్తిలో 3వ వంతు తేవాలని వేధించేవారు. ఈ విషయాన్ని తరచూ భావన తన తండ్రి,తల్లి వద్ద చెప్పు కుంటూ బాధపడుతుండేది. ఈ బాధలు తాళలేక తన కూతురు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తండ్రి క్యాస కిష్టయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. భర్త జ్ఞానేశ్వర్ హోటల్‌లో విధులు ముగించుకొని అర్ధ రాత్రి 12గంటలకు ఇంటికి వెళ్లేసరికి భావన ఉరికి వేళాడుతూ కనిపించింది. కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి, సీఐ రాంచందర్‌రావు సంఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఫోరెన్సిక్ నిపుణులతో తనిఖీ చేయించినట్లు, భర్త, అత్త, మామ, ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

భార్యాపిల్లల బాగోగులు చూడని ఉద్యోగి సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన పెద్దపల్లి కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తరచుగా గృహహింసకు పాల్పడుతూ భార్యాపిల్లల బాగోగులు పట్టించుకోని ప్రభుత్వ ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఓదెల ప్రాథమికఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న కె రవీందర్ తమ పోషణను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆయన భార్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక సఖికేంద్రం సిబ్బంది భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించడానికి ప్రయత్నించగా రవీందర్ సహకరించ లేదన్నారు. గృహహింస నిరోధక చట్టం ప్రకారం మరోసారి జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ నోటీసులు జారీ చేసినప్పటికీ రవీందర్ కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల పరివర్తన నియమావళి ప్రకారం భార్యపిల్లల పోషణను నిర్లక్ష్యం చేస్తున్న ఫార్మాసిస్టు కె రవీందర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామశివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఎల్లమ్మ విగ్రహంపై ఉన్న బంగారు, వెండి ఆభరణలు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. వాటి విలువ సుమారు 20వేల వరకు ఉంటుందన్నారు. ఈ మధ్య మండలంలో చాలా గ్రామాల్లోని ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి

- ఇన్‌చార్జి మంత్రి తుమ్మల అధ్యక్షతన హైదరాబాద్‌లో సమావేశం
- ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టిసారించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనాయకులతో ఉన్నతస్థాయి సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పలు అంశాలపై సమీక్షించారు. యువతకు ఉపాధి అవ కాశాలు కల్పించే విషయంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించే విషయంలో అందరూ దృష్టిసారించాలన్నారు. రైతు బజార్లను విస్తరించాలని, ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టిని సారించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని తెలిపారు.

పార్టీని బలోపేతం చేయాలి..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రధానంగా గ్రామ, మండల స్థాయిల్లో పార్టీని బలోపేతం చేయాలని, వారి ద్వారా ప్రజల సమస్యలనుతెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల జిల్లా మంత్రులను, ఎమ్మెల్యేలను, నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు సూచించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఆ సమాచారాన్ని ఇన్‌చార్జి మంత్రికి అందజేశారు. సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరిస్తూ ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకో వాల్సిన చర్యల గురించి ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువచ్చారని సమాచారం.

ప్రధానంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, పంట నష్టపరి హారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఇన్‌చార్జి మంత్రి తుమ్మల సూచించినట్లు తెలిసింది. త్వరలోనే ఇరిగేషన్, రోడ్లు, భవనాలశాఖ మంత్రులతో కలిసి ఆయాశాఖల ప్రత్యేకసమీక్షా సమావేశాలను నిర్వహిస్తామన్నారు. దీనిద్వారా ఉమ్మడిజిల్లా పరిధిలో ఉన్న అన్ని సాగునీటి సమస్యలు, రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తుమ్మల ప్రజాప్రతినిధులకు వివరించారు.

'కరీంనగర్'పై చర్చ

ఈ సందర్భంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామక విషయం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్ కరీంనగర్ ఇన్‌చార్జిని నియమించకపోవడంతో జిల్లా కేంద్రంలో పార్టీ బలహీనపడుతోందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీని ప్రభావం పెద్దపల్లి, చొప్పదండితో పాటు సమీప నియోజకవర్గాలపై పడుతున్నదని, వెంటనే ఈ సమస్యను పరిష్కరిం చాలని కోరినట్లు తెలిసింది. మంత్రి శ్రీధర్‌బాబు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని సమాచారం. వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, గత ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు ఒక్క డివిజన్‌ను కూడా గెల్చుకోలేకపోయామని, అలాగే 26 గ్రామాల్లో కూడా స్థానిక ప్రజాప్రతినిధులను గెలిపించు కోలేక పోయామని తెలిపారు. కరీంనగర్‌లో పార్టీ పరిస్థితి ప్రస్తుతం ఆశాజనకంగా లేదని, నియోజకవర్గ ఇన్‌చార్జిని నియామకంలో జాప్యం చేస్తే పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చని మంత్రి తుమ్మలకు వివరించారని తెలిసింది. దీంతో వెంటనే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించాలనే అభిప్రాయానికి మంత్రులు వచ్చినట్లు సమాచారం. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, విజయరమణారావు, రాజ్‌ఠాకూర్, డాక్టర్ సంజయ్ కుమార్, నియోజకవర్గ ఇంచార్జిలు వొడితెల ప్రణవ్, జువ్వాడి నర్సింగరావు, కేకే మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, వి నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులతో ఉద్యోగాలు

● హైదరాబాద్‌కు వెళ్లిన విద్యార్థులు



పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న యువకులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో గల ప్రభుత్వ ఐటీఐలో టాటా కంపెనీ నూతనంగా తీసుక వచ్చిన కోర్సులతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఆయా కోర్సులు చదివిన నిరుద్యోగులకు హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలు రావడంతో బుధవారం పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి పలువురు హైదరాబాద్‌కు వెళ్లారు. పెద్దపల్లి ఐటీఐలో టాటా కంపెనీ మ్యాను ఫ్యాక్చరింగ్‌లో ఏడాది కోర్సును ప్రవేశపెట్టింది. ఈ కోర్సును పలువురు విద్యార్థులు అభ్యసించారు. ఇటీవల కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూ లకు వారు హాజరు కావడంతో చాలామందికి ఉద్యోగం కల్పిస్తూ అపాయింట్‌మెంట్ లెటర్లు అందాయి. దీంతో వారు హైదరాబాద్‌లోని తుక్కుగూడలోని ఇన్ఫోసిస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా లభిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో సాయి రోహిత్ గౌడ్, సుమిత్, ఆదిత్య, ముఖేష్, పి సాయి కిరణ్, ఎ సాయి కిరణ్, ఫరాజ్, నితిన్, ఎ శివమణి, అభి, శివకుమార్, యశ్వంత్, అభిలాష్, రేవంత్ తదితరులు ఉన్నారు.

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలకు ఉమ్మడి జిల్లా వాసులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో కృషి చేస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 48 మందిని తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారాలతో సత్కరించనుంది. ఈ క్రమంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానంద రావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆయారంగాలకు చెందిన ప్రముఖులను ఎంపిక చేసి జాబితా విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఐదుగురు ఎంపికవడం విశేషం. ఎంపికైన వారిలో ఎస్.రఘువర్మ (అనువాదరంగం-జగిత్యాల), మంగారి హిమజ (రచనారంగం-వేములవాడ), పిన్నంశెట్టి కిషన్ (కథారంగం-వేములవాడ), రతన్‌కుమార్ (పేరిణీనృత్యం-కరీంనగర్), పాతూరి మహేందర్‌రెడ్డి (ఉపాధ్యాయరంగం-రాజన్నసిరిసిల్ల) ఉన్నారు. వీరికి తెలుగు విశ్వవిద్యాలయం-నాంపల్లి ప్రాంగణంలో రూ.5,116 చొప్పున నగదుతో కూడిన పురస్కారం అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

కనుమరుగవుతున్న జానపద కళలు



ఒగ్గుడోలు, బోనాల కళాకారులు (ఫైల్)

● ఆదుకోవాలంటున్న కళాకారులు
● రేపు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విశిష్ట సంప్రదాయానికి సజీవ సాక్ష్యమైన జానపద కళలు కనుమరుగవుతున్నాయి. కళనే నమ్ముకున్న వేలాది మంది కళాకారులు రోడ్డున పడుతున్నారు. కళలు వెలుగులోకి రావడం లేదు. కళాకారులకు పొట్ట గడవని దుస్థితి ఏర్పడింది. ఆధునికత, ప్రపంచీకరణ, సామాజిక మార్పులు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కళలను దెబ్బతీశాయి. 22న అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం సందర్భంగా ఓ కథనం.



గొల్ల సుద్దులు కళారూపం (ఫైల్)

నేపథ్యం..

1926లో అమెరికాలో హెన్నీ హెరాల్డ్ లూయిస్ ఆయా దేశాల, ప్రాంతాల కళలకు ప్రాచుర్యం లభించేందుకు జానపద కళల దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించారు. ఈ క్రమంలో యేటా ఆగస్టు 22న ఈ దినోత్సవం జరుపుకుంటారు.

జిల్లాలో జానపద కళల స్థితి..

ఉమ్మడి జిల్లాలో దాదాపు ఆరు వేల మంది జానపద కళాకారులున్నారు. కొందరు కళనే వృత్తిగా చేసుకొని జీవనోపాధి పొందుతుంటే మరికొందరు పూట గడవని స్థితిలో ఉన్నారు. మిద్దెరాములు, గోపాల్‌రాజ్ భట్టు, గోలి రాజగోపాల్‌రెడ్డి, రతన్‌సింగ్, వెంకటేశ్ నాయక్, కళాచందర్, జనమంచి రాములు, రజనీశ్రీ, కోడూరి రవీందర్‌గౌడ్ వంటి కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. జి కృపాదానం, సంగెం రాధాకృష్ణ, కచ్చు అంజయ్య, దొడ్ల మల్లయ్య, గోపాల్‌రావు, రాజమౌళి, కనకం రమణయ్య, అందాసి నారాయణ, కోడూరి పోచయ్య, ఎండీ ఇస్మాయిల్, తీగల రాజేశం, రాములు, గజవెల్లి వెంకటనరసయ్య వంటి వారు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కళా ప్రదర్శనలిస్తూ జిల్లాకు కీర్తి తీసుకవస్తున్నారు. ఉత్సవాలు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంలో తప్ప వీరి ప్రదర్శనలకు వీలు లేకుండా పోయింది. కొందరు పెన్షన్ అందుకుంటున్నా ఆ డబ్బులు సరిపోక గ్రామాలు తిరుగుతూ పొట్ట పోసుకుంటున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలిచ్చినా అర్హులైన వారికి ఉద్యోగాలు రాలేదనే విమర్శలు వస్తున్నాయి.

మలి దశ ఉద్యమంలో జానపదం...

తెలంగాణ మలి దశ సాంస్కృతికోద్యమంలో జానపద కళలు కీలక పాత్ర పోషించాయి. కళాకారులు తమ కళారూపాలతో నిరసనలు తెలిపారు. ప్రజా చైతన్యం కోసం ఊరూరా ఆటాపాటలతో తిరిగారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తమను పట్టించుకునే వారే లేరని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి జానపద కళోత్సవాల జాడ లేకుండా పోయింది. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాకైనా కళాకారులకు సముచిత గుర్తింపు వస్తుందని ఎన్నో ఆశలతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 400 మందికి పెన్షన్లు వస్తుండగా, జిల్లాలు వేరైన తర్వాత అదనపు కోటా కేటాయించాల్సి ఉంది.

కళాకారుల డిమాండ్లు

- రాష్ట్ర ఆవిర్భావ దినం జూన్ 2ను జానపద కళల దినోత్సవంగా ప్రకటించాలి.
- ప్రతి జిల్లాకు కల్చరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్‌ను నియమించాలి.
- యేటా జానపద కళోత్సవాలు నిర్వహించాలి.
- విశ్వ విద్యాలయాల్లో సర్టిఫికెట్ కోర్సు ప్రవేశపెట్టి సీనియర్ కళాకారులకు, ఔత్సాహికులకు అవకాశం కల్పించాలి.
- అర్హులైన కళాకారులను గుర్తించి ఉద్యోగాలు, ఇళ్లు, పెన్షన్లు, జీవన భృతి అందించాలి. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.



చిరుతల భజన

డప్పు నృత్యం

బుడుబుక్కలవారు



కళలకు ప్రాధాన్యమివ్వాలి..

- గుండ్ర కృపాదానం, జానపద కళాకారుడు

ప్రాచీన జానపద కళలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. కళలు, కళాకారుల గుర్తింపులో ప్రభుత్వం ప్రధాన భూమిక పోషించాలి. పెన్షన్లు అందరికీ అందేలా చూడాలి.



పేద కళాకారులకు న్యాయం చేయాలి...

- కనకం రమణయ్య, జానపద కళాకారుడు

ప్రభుత్వం జానపద కళాకారులను ఆదుకోవాలి. ఉమ్మడి 10 జిల్లాల్లోని కళలను వెలికి తీయాలి. పేద కళాకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి.



పూర్వ వైభవం తీసుకురావాలి..

- అందాసు నారాయణ, జానపద కళాకారుడు

కళలకు పూర్వ వైభవం తీసుకురావాలి. కవులు, గాయకులు, కళాకారులు ఏకం కావాలి. సృష్టిలో జానపదానికి ముగింపు లేదు. నాయకులను, ప్రజలను చైతన్య పరిచేది జానపదం.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి మరింత జాప్యం

● సమీక్ష జరిపిన సీఎండీ శర్వానంద్ ● డెన్మార్క్ నుంచి హల్దర్ టాప్ ఇంజనీర్ రాక

కోల్‌సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో షట్‌డౌన్ అయిన ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి పునరుద్ధరణకు మరింత జాప్యం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నెల 24న ఉత్పత్తి ప్రారంభమవుతుందని ప్రాజెక్టు వర్గాలు అంచనాల వేసినా అది సాధ్యపడే పరిస్థితి లేదు. మరో వారం నుంచి పది రోజులు కనీసంగా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇప్పటికే టెక్నాలజీ సరఫరా చేసిన డెన్మార్క్‌కు చెందిన హల్దర్ టాప్స్ ఇంజనీర్ ఒకరు రామగుండం చేరుకుని పరిశీలించారు. మరికొన్ని ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటేనే మరమ్మతులు జరిగే అవకాశం ఉంది. రెండు నెలల క్రితం వార్షిక మరమ్మతుల సమయంలో కీలకమైన హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేశారు. దాన్ని వినియోగించకుండా ఉత్పత్తి ప్రారంభించడం వల్ల ఒత్తిడి పెరిగి అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీ అవుతున్నట్టు తెలుస్తుంది. హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించాలంటే రూ.150కోట్ల నుంచి రూ.200కోట్లు అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించేందుకు ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుం ది.హల్దర్ సంస్థనే హెచ్‌టీఆర్‌ను సమకూర్చాల్సి ఉంటుంది. హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించకుండా మరమ్మతులు చేసినా మళ్లీ సమస్యలు ఉత్పన్నమవుతాయని యూరియా పరిశ్రమలో పనిచేసిన సాంకేతిక నిపుణులు పేర్కొంటు న్నారు. తెలంగాణలో యూరియా కొరత తీవ్రమవడం, రైతులు రోడ్ల మీదకు వచ్చిన పరిస్థితుల్లో తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. పార్లమెంట్‌లో వాయిదా తీర్మాణం కూడా పెట్టారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పునరుద్ధరణపై సమీక్ష జరుపుతున్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఎండీ శర్వానంద్ బుధవారం ఢిల్లీ నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు చేరుకుని అధికారులతో సమీక్ష జరిపారు. మరోవైపు ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమల ఉత్పత్తిని పునరుద్ధరించి తెలంగాణకు నిర్దేశించిన కోటాను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తుంది. ఆర్‌ఎఫ్ సీఎల్‌లో ఉత్పత్తికి మరింత జాప్యం ఏర్పడితే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యూరియా కొరత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్‌ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయం రామగుండంకు తరలించి యుద్ధప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటేనే ఆర్‌ఎఫ్‌సీఎల్ సాంకేతిక ఇబ్బందుల నుంచి బయటపడే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.



ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టులోని హెచ్‌టీఆర్

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల గోదావరిలోకి వరద ఉధృతి పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. ధర్మపురి పట్టణంలోని మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద నుంచి పెరుగుతున్న గోదావరివరదను పరిశీలించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులతో మాట్లాడుతూ భారీవరదల నేపథ్యంలో గోదావరినదికి స్నానాలు చేసేందుకు వచ్చేభక్తులు లోపలికి వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షితప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ సిబ్బందిని అప్రమత్తంచేస్తూ నిత్యం అందుబాటులో ఉండేలాచర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తేచర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవోరవీందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్‌ఐలు ఉదయ్ కుమార్, రవికుమార్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్ ఉన్నారు.

ఉమ్మడిజిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శిగా అనూప్‌రెడ్డి



అనూప్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాశాలల క్రీడాసమాఖ్య అండర్-19 కార్యదర్శిగా కొడిమ్యాల మోడల్‌స్కూల్, కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డి అనూప్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యదర్శిగా నియామకమైన అనూప్ రెడ్డికి బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. 2025-26విద్యాసంవత్సరానికి ఉమ్మడి జిల్లా కళాశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శిగా అనూప్‌రెడ్డి బాధ్యతలను నిర్వహిస్తారని డీఐఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కళాశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే క్రీడాపోటీలను ఘనంగా నిర్వహించాలని అనూప్ రెడ్డికి డీఐఈవో సూచించారు. ఈసందర్భంగా అనూప్ రెడ్డిని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

బాలసాహితీవేత్త 'కందేపి'కి తెలుగు భాషా కీర్తి పురస్కారం



డాక్టర్ కందేపి రాణీప్రసాద్

సిరిసిల్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ తెలుగుభాషా కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు భాష, సంస్కృతి, వైభవం, సాహిత్యం, కళల పరిరక్షణ కోసం నిరంతరాయంగా కృషిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా అందించే తెలుగు భాషా కీర్తిపురస్కారాన్ని 2025 సంవత్సరానికి అందిస్తున్నట్లు చైర్మన్ కత్తిమండ ప్రతాప్ బుధవారం ప్రకటించారు. ఈనెల 31న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆంధ్రాలోని పల్నాడుజిల్లా నరసరావుపేటలో నిర్వహించే తెలుగుభాషా దినోత్సవంలో రాణిప్రసాద్‌కు పురస్కారాన్ని అందించనున్నారు. అనేక కొత్త ప్రయోగాలు చేసి, బాలల మానసిక, వైజ్ఞానిక వికాసం కోసం డాక్టర్ కందేపి రాణిప్రసాద్ చేస్తున్న అవిరళ కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. రాణిప్రసాద్ గత 35సంవత్సరాల్లో 55పుస్తకాలు రచించారు. బాలసాహిత్యంలో వైజ్ఞానిక రచనలు అంశంపై పీహెచ్‌డీ చేశారు. అవార్డుకు ఎంపికైన రాణిప్రసాద్‌ను మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, జిల్లా రచయితల సంఘం కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



శృతిక

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శృతిక జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం మధుమాలతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శృతిక, అశ్లేషలు పాల్గొన్నారని పేర్కొన్నారు. శృతిక ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఈనెల 26, 27 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో బాలేవాడీ మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని శృతిక పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పీడీ అక్బర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

తపాలా ఉద్యోగులకు వేతన సంఘాన్ని ఏర్పాటు చేయండి

● తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

ఓదెల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తపాలా ఉద్యోగులకు 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ (సి) రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ కోరారు. బుధవారం పొత్కపల్లి, ఓదెల తపాలా కార్యాలయాల వద్ద భోజన విరామం సమయంలో తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్ల ప్రతులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ నేటి వరకు 8వ వేతన కమిటీని నియమించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లు తీవ్ర ఆందోళనకు, నిరాశనకు గురతున్నారని తెలిపారు. 2026 జనవరి ఒకటి నుంచి చెల్లించాల్సిన నూతన వేతనాలకు ఇప్పటివరకు వేతన సంఘం చైర్మన్, సంఘ సభ్యులను నియమించక పోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, సేవలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యగులు ప్రజలకు త్వరగా పారదర్శకంగా అందిస్తున్నప్పటికీ ఉద్యోగుల వేతన సవరణ విషయం లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమని అన్నారు. జనవరి ఒకటి నుంచి నూతన వేతనాలు అందించాలని అలాగే గ్రామీణ తపాలా ఉద్యోగులను 8వ వేతన సంఘంలో చేర్చాలని అన్నారు. పెన్షనర్లకు యధావిధిగా పెన్షన్లు అందచేయాలని కోరారు. అలాగే పాత పెన్షన్ ప్రకారం ప్రయోజనాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపాల ఉద్యోగులు ఉస్మాన్, ముత్తయ్యవెంకటేష్, సాయిరాం, రఘు, రిషిక, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిమాండ్ల ప్రతులతో నిరసన తెలుతున్న ఉద్యోగులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

వేములవాడ రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం సందర్భంగా ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు తలనీలాలు సమర్పించి క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కులను చెల్లించుకున్నారు. కాగా, రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలోని సీతారామచంద్ర స్వామివారికి బుధవారం పునర్వసునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో లెక్కించారు. 34రోజులకు హుండీ ఆదాయం కోటి 97లక్షల 54 వేల 588రూపాయలు, 170 గ్రాముల బంగారం, 10కిలోల 300గ్రాముల వెండి సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. ఈవో రాధాబాయి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. కార్యాలయ పరిశీలకులు, ఏసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రి' నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

● ఎస్సారెస్పీతో కలిపి 19,150క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలింపు



గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఇంత వరకు మూడు, నాలుగు పంపుల ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలిస్తున్న అధికారులు ప్రస్తుతం ఎస్సారెస్పీనుంచి నీరు వస్తున్న నేపథ్యంలో మంగళవారం ఒక్క పంపునకు కుదించారు. అయితే బుధవారం కూడా ఒక్కపంపు ద్వారా 3150 క్యూసెక్కుల నీరు పంపుహౌస్ నుంచి వరద కాలువకు తరలివెళ్తోంది. అలాగే ఎస్సారెస్పీ నుంచి 16వేల క్యూసెక్కుల నీరు వరదకాలువలో చేరుతోంది. దీంతో ప్రస్తుతం వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 19,150 క్యూసెక్కుల నీరు తరలివెళ్తోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీప్రాజెక్టు నుంచి వరద కాలువకు నీటి ప్రవాహం పెరుగు తుండగా ఇంకా పెద్ద మొత్తంలో ఇక్కడికి నీరు వచ్చేఅవకాశం ఉండడంతో అధికారులు గాయత్రి పంపుహౌస్‌లో పంపులను తగ్గించారు. ప్రస్తుతం గాయత్రి పంపుహౌస్ నుంచి 3150, ఎస్సారెస్పీ నుంచి 16 వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు చేరుతోంది. రెండువైపులా వచ్చి 18,150 క్యూసెక్కుల నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీరు తరలివెళ్లడంతో వరద కాలువ నిండుకుండలా తయారవడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడుతోంది. ఖరీఫ్ గట్టెక్కుతుందనే నమ్మకంలో ఉన్నారు.

సిరిసిల్ల వద్ద మానేరు పరవళ్లు

● ఎగువ మానేరు ప్రాజెక్టు నుంచి 9734 క్యూసెక్కుల వరద నీరు
● మిడ్ మానేరు ప్రాజెక్టులోకి గోదావరి జలాలు



జలకళ సంతరించుకున్న మానేరు వాగు

సిరిసిల్ల ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మానేరు వాగు పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలోని గంభీరావుపేట మండలం నర్మాల ప్రాజెక్టులోకి కూడెల్లి, పాల్వంచ వాగుల నుంచి భారీగా వరద నీరు చేరి మత్తడి దూకుతోంది. ప్రాజెక్టు నుంచి మానేరు వాగులోకి 9734 క్యూసెక్కుల వరదనీరు పరవళ్లు తొక్కుతూ మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి చేరుతోంది. బుధవారం మానేరు జలకళను చూడడానికి సిరిసిల్ల ప్రజలు వాగు వద్దకు తరలివచ్చారు. మానేరు జలాలకు పూజలు చేశారు. ఎగువ మానేరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 9734 క్యూసెక్కులు కొనసాగుతోంది. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.55 టీఎంసీలకు 14.89 టీఎంసీలకు చేరుకుంది. మిడ్‌మానేరు ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు వరద కాలువ ద్వారా 13802 క్యూసెక్కులు నీళ్లు వస్తుండగా, మానేరు, మూలవాగు వరదనీరు 200 క్యూసెక్కులు చేరుతుంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 17152 ఉండగా, అన్నపూర్ణ ప్రాజెక్టుకు అవుట్ ఫ్లో 3310 క్యూసెక్కులు కొనసాగుతోంది.

కలిసికట్టుగా మంతనాలు..

(5వ పేజీ తరువాయి)

భారీ రాబడి ఉంది. 1 డిసెంబర్ 2023 నుంచి 28జూలై 2025 వరకు జిల్లాలో వచ్చిన ఆదాయం రూ.837 కోట్లు ఉంది. ఇందులో లిక్కర్ కేస్‌లు 14,87,188 విక్రయించగా బీర్ కేస్‌లు 14,87,188 విక్రయించారు. 1డిసెంబర్ 2021 నుంచి 30 నవంబర్ 2023 వరకు రూ.996కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో లిక్కర్ కెస్‌లు 8,92,646 విక్రయించగా, బీర్ కేస్‌లు 19,01,053 విక్రయించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

తంగళ్లపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమిపూజలు చేసి పనులను ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాల్గాం ప్రవీణ్‌కుమార్(టోనీ), మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరేళ్ల నర్సింగంగౌడ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు లింగాల భూపతి, రాపెల్లి ఆనందం, సుద్దాల శ్రీనివాస్, వాసు, కరుణాకర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పెద్దూర్ తిరుపతి, చుక్క రాజశేఖర్, బండి పర్శరాములు, సామల రమేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి సమీర్‌లు పాల్గొన్నారు.

పాడి పశువులతో ఆర్థికంగా వృద్ధి చెందాలి..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ - గంభీరావుపేట మండలంలో 17 మంది లబ్ధిదారులకు పశువుల పంపిణీ

గంభీరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులను సద్వినియోగం చేసుకుని పేద కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆకాంక్షించారు. గంభీరావుపేట మండలం దేశాయిపేట గ్రామంలోని ప్రగతిభవన్‌లో 17 మంది ఎస్సీ లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 2 చొప్పున 34 పాడి పశువులను బుధవారం కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేసే పశువులు డెలివరీ తర్వాత 12 నుంచి 15లీటర్ల వరకు పాలు అందిస్తాయని లబ్ధిదారులకు 2 పశువులను సబ్సిడీపై అందిస్తున్నామని, వీటిని వినియోగించుకుంటూ ఆర్థికంగా ప్రజలు ఎదగాలని, 2 పశువులను క్రమంగా 10 పశువుల స్థాయికి పెంచుకోవాలన్నారు. పశువులకు సంబంధించి డైట్ చార్ట్ తెలుగులో తయారుచేసి లబ్ధిదారులకు అందించాలని పశువైద్యాధికారిని ఆదేశించారు. భవిష్యత్‌లో ప్రతి మండలంలో పాడి పశువుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. హర్యానా నుంచి వచ్చిన పశువులు స్థానికంగా అలవాటు పడటానికి వారం రోజులు సమయం పడుతుందన్నారు. సబ్సిడీపై పంపిణీ చేసిన పశువులను బయట అమ్మడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు. ప్రతి పశువుకు బీమా సౌకర్యం కూడా కల్పించామన్నారు. పశువుల ద్వారా రోజు 2000 రూపాయల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. హర్యానా పశువులను తీసుకుని రావడంలో కృషి చేసిన వెటర్నరీ అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. వర్షాకాలంలో పచ్చి గడ్డి బాగా దొరుకుతుందని, వీటిని వినియోగించుకుని పశువులను మంచి ఆహారం అందించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసిన పేద కుటుంబాలకు పశువులను పంపిణీ చేస్తున్నామన్నారు. గేదెలకు ఆరోగ్యపరంగా బీమా వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ డెయిరీలకు లబ్ధిదారులు పాలు పోయాలని సూచించారు. పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని లేగ దూడలకు పాలు కొంత వదిలి మిగిలినవి పిండుకోవాలని, లేగ దూడల పోషక లోపాలు రాకుండా చూసుకుంటే మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, పశువైద్యాధికారి అంజిరెడ్డి, లబ్ధిదారులు సంబంధిత అధికారులు, రైతులు ఉన్నారు.



పాడి పశువులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి సన్మానం

కోనరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారంలో బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకమై కోనరావుపేటకు మొదటిసారిగా వచ్చిన పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపిని సత్కరించారు. గొట్టే రామచంద్రం, సురేష్ గౌడ్, పరశురాం, దాసరి పూర్ణిమ, మల్లేశం, తిరుపతి, సుధాకర్, విజయ్, శంకర్, నాగరాజు, వేణు ఉన్నారు. అలాగే కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన గోపాడి సురేందర్‌రావు బీజేపీ జిల్లా కార్యదర్శిగా రెండవసారి నియామకమైన సందర్భంగా పార్టీ నాయకులు ఆయనను సన్మానించారు. గొట్టే రామచంద్రం, వెలిశాల రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

చందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):చేపల పెంపకంలో మత్స్యకారులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో మత్స్య సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేపల, రొయ్యల పచ్చళ్ళ దుకాణాన్ని బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మర్రిగడ్డ మత్స్య సహకార సంఘం వారి ఆధ్వర్యంలో చేపల, రొయ్యలతో పచ్చళ్ళు తయారీ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, నాయకులు చింతపంటి రామస్వామి, ధర్మపురి శ్రీనివాస్, తుపాకుల శ్రీనివాస్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

చందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో రాధ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బీడీ కార్మికుల కుటుంబాల విద్యార్థులకు ఉపకార వేతనాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు అందించి త్వరగా ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, అధికారులు ప్రసన్న రాణి, నర్సింగ్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ ఎన్నిక

తంగళ్లపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నూతన పేరెంట్స్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుగ్గిళ్ల మమత, వైస్‌చైర్మన్‌గా బంటు బాబు, ప్రధాన కార్యదర్శిగా ఏనుగుల రమణ, కార్యదర్శిగా కులేరి కిషోర్‌కుమార్, కోశాధికారిగా కొంపెల్లి శ్యాం, ప్రచార కార్యదర్శిగా గుడిసె గంగయ్య, కమిటీ సభ్యులుగా కనకయ్య, లచ్చయ్య, ప్రభాకర్, దేవదాస్‌లను ఎన్నుకున్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్‌కు ఎంపిక

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్స్‌లలో ప్రవేశాల కోసం బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ సమక్షంలో పిల్లల తల్లిదండ్రులతోనే డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఇద్దరు బాలికలు, నలుగు బాలురను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన వెల్ఫేర్ అధికారి సంగీత తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయాన్ని మానుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల వెల్ఫేర్ బోర్డు స్కీంలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ తెలంగాణ బిల్డింగ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్‌చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో బుధవారం సీఐటీయూ తెలంగాణ బిల్డింగ్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజమల్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25న కలెక్టరేట్ ఎదుట ధర్నాచేయడం జరుగుతుందని ప్రకటించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లెలో అసైన్డ్ భూవివాదం

ముస్తాబాద్, అగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకట్రావుపల్లెలో అసైన్డ్ భూ వివాదం బుధవారం ఇరువర్గాల మధ్య పెద్ద గొడవకు దారితీసింది. గ్రామంలోని 798 సర్వే నంబరుగల భూమిలో 84 ఎకరాల భూమి ఉండగా, 60 ఎకరాల భూమికి పట్టాలను 30 యేళ్ల కిందట ఇచ్చారు. 24 ఎకరాల భూమి అలాగే ఉంది. కాగా పట్టాలు ఇచ్చిన అనంతరం వారికి సర్వే నంబరులో హద్దులు చూపటం మరిచారని గ్రామస్థులు పేర్కొన్నారు. పట్టాలు పొందిన కొంత మంది హద్దులు చూపకున్నా రోడ్డుకు ఉన్న స్థలాన్ని అక్రమంగా కబ్జా చేస్తున్నారని వెంకట్రావపల్లె గ్రామస్థులు మండిపడ్డారు. ఊరందరికి ఉపయోగపడే ఆ స్థలంలో కొన్నేళ్లుగా ఐకేపీ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టాలు పొందిన వారికి సర్వేచేసి ఇతర స్థలంలో ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని 24 ఎకరాల భూమిని మాత్రం ఊరికి ఉపయోగడేలా కాపాడాలని అధికారులకు వినతి చేశారు. కాసేపు ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకోవడంతో ఎస్సై గణేశ్, తహసీల్దార్ సురేశ్ ఘటన స్థలానికి చేరుకొని గొడవను సద్దుమణిగింపజేశారు. ఐకేపీ సెంటర్‌లో ఎవరూ సాగు చేయొద్దని, ఆక్రమించొద్దని, జిల్లా అధికారులకు సమాచారం అందిస్తామని, ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని పేర్కొన్నారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేశ్, ఎస్సై గణేశ్

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలు గ్రామాలకు చెందిన నాయకులు, మత పెద్దలు, నిర్వాహకులతో బుధవారం శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మతవిద్వేషాలకు తావివ్వకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సాహంగా నిర్వహించుకోవాలన్నారు. ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. అల్లర్లు సృష్టిస్తే కేసులు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్‌రెడ్డి, ఆయా గ్రామాల మత పెద్దలు, వినాయక మంటప నిర్వాహకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌ను తొలగించాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలోని సులభ్ కాంప్లెక్స్‌ను వెంటనే తొలగించాలని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. పాత బస్టాండ్ సమీపంలో మైసమ్మ దేవాలయంను అనుకొని ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను తొలగించాలని బుధవారం బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖాదీర్‌పాషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వడ్నాల శేఖర్, మేరుగ శ్రీనివాస్, వినయ్, దూడం సురేష్ వెలిచాల అభినవ్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీకాంత్, నాయకులు

నీటి సమస్యను పరిష్కరించాలి

మున్సిపల్ పరిధిలోని 34వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను మున్సిపల్ అధికారులు వెంటనే పరిష్కరించాలని వార్డు మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్ అన్నారు. బుధవారం నీటి సమస్యలను పరిష్కరించాలని 34వ వార్డులో ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ వార్డులోని పవర్ బోర్ 40 రోజుల క్రితం చెడిపోవడంతో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అయిన అధికారులు స్పందించకపోవడంతో వార్డు నీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్ల నీళ్లు ఇంటి అవసరాలకు సరిపోయేంత రాకపోవడంతో చాలా మంది వార్డు ప్రజలు పవర్‌బోర్ ద్వారా వచ్చే నీటిని ఎక్కువగా ఉపయోగించుకుంటారని అన్నారు.

మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి..

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గాంధీచౌక్‌వద్ద సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, కాసర్ల రాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, ఆడెపు చంద్రకళ, వెంగళ లక్ష్మీనర్సయ్య, రాగుల జగన్, ఆడెపు ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, నాయకులు ఇరుకుల్ల భాస్కర్, అన్నల్‌దాస్ భాను, గుజ్జె రమేష్, చందన, రోజా, ఎర్రం మల్లయ్య, రంగ కిషన్, గడ్డం కిరణ్ పాల్గొన్నారు.

● మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ జిల్లా మహిళ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలతో నివాళులర్పించి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం ఉచితంగా పేద మహిళలకు సానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి కోడం అరుణ, ఉపాధ్యక్షురాలు సామల రోజా, కోడం సుధా, సాగాల లత, మార్గం మంజుల, మహిళలు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, బాబు, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాజేందర్, మహేందర్, రాజునాయక్, రాంరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, నరేందర్, గోపాల్, బాలయ్య, బాల్‌రెడ్డి, రఫీక్, ఇమాం తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : మాజీప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు వేములవాడ, వేములవాడరూరల్ మండలంలో ఘనంగా జరిగాయి. వేములవాడ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మెన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, నామల లక్ష్మీరాజం, ఇప్పపూల అజయ్, పీర్ మహమ్మద్, నాగుల విష్ణు, దుర్గం పర్శరాం, వస్త్రాది కృష్ణ, సాబిర్, నాగుల మహేష్, తోట రాజు, ఇన్నారం సాగర్, కట్కూరి శ్రీనివాస్, ముప్పిడి శ్రీధర్, మస్తాన్, రజాక్, నరేష్, షాహిద్, ఇర్ఫాన్, సాబిర్, దేవయ్య, చందు, అంజయ్య పాల్గొన్నారు.

వేములవాడ మార్కెట్‌కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ రొండి రాజు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ కనికరపు రాకేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీచైర్మెన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహన్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాదర్, తర్రె లింగం, గడ్డం స్వామి, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, గుగ్గిళ్ల వెంకటేశం, బోల్లి దేవేందర్, ఎర్రం రాజలింగం, గండి అశోక్, పల్లికొండ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా చేపట్టారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాల్గాం ప్రవీణ్‌కుమార్(టోనీ), మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరేళ్ల నర్సింగం గౌడ్, లింగాల భూపతి, పెద్దూర్ తిరుపతి, రాపెల్లి ఆనందం, శ్రీకాంత్‌గౌడ్, రాజశేఖర్, మోర రాజు, శేఖర్, మునిగేల రాజు, గుగ్గిళ్ల భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● బోయినపల్లి : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండలంలోని తడగొండలో ఘనంగా నిర్వహించారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొడగాని వెంకటేష్ ,సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నిమ్మ వినోద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎండి బాబు, గుడి శేఖర్‌రెడ్డి, మెరుపుల మహేష్, మాజీ సర్పంచులు కోరేపు నరేష్, వంగపల్లి సత్యనారాయణరెడ్డి, మాజీఎంపీటీసీలు ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎనుగుల కనకయ్య, జంగం అంజయ్య, నాగుల వంశీ, మమ్మద్ హుస్సేన్, పిట్టల రమేష్, ఎండి నజీర్, కేశవరెడ్డి, మండల నరేష్, మండల శ్రీనివాస్, కొండ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సయ్య, గుండెల్లి శ్రీనివాస్, గజ్జెల రాజు, అనిత, కొండం రాజిరెడ్డి, నవీన్, శీల ప్రశాంత్, ఆగుళ్ల రాజేశం, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, బొప్ప నర్సయ్య, బొప్ప విష్ణు, గాంత రాజు, భానుచందర్, శ్రీనివాస్, మిరుదొడ్డి భాను, ఉచ్చిడి బాల్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తిప్పాపూర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దిగుబడిపై వయ్యారిభామ కలుపుమొక్కల ప్రభావం

ఇల్లంతకుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వయ్యారిభామ కలుపు మొక్కలతో దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో బుధవారం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహాత్మా జ్యోతిబాపూలే మహిళా వ్యవసాయ కళాశాల విద్యార్థినీలు వసుందర, శ్రేయ, దివ్య, పూజిత, దివ్యతరుణి, అశ్రితలతో పాటు రైతులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరతలేకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంద అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రానికి రావలసిన కోటాకంటే కేంద్రప్రభుత్వం తక్కువగా కేటాయించిందన్నారు. ప్రభుత్వాల వైఖరిలో మార్పురావాలని కోరారు.

దివ్యాంగుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇల్లంతకుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాచారం గ్రామానికి చెందిన కరికవేణి రాజు అనే దివ్యాంగుడికి ముదిరాజ్ సంఘ నాయకులు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. రాజు భార్య లక్ష్మి ఇటీవలే ప్రమాదవశాత్తు మృతిచెందగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ముదిరాజ్ సంఘ నాయకులు రూ 5వేలు అందించారు.చొప్పరి రామచంద్రం, గొడుగు నర్సయ్య, ఎలవేని రమేష్, కంకటి ప్రభాకర్, నర్సింగం, నాగరాజు, రామచంద్రం, వెంకన్న, సురేష్, స్వామి, బాలయ్య, నర్సింగం, రాజయ్య ఉన్నారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

ఇల్లంతకుంట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శపాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్న గోవతోటి రాగమాళిక డాక్టరేట్ పట్టాను అందుకుంది. హైద్రాబాద్‌లోని ఉస్మానియా స్నాతకోత్సవంలో పట్టాను ఇస్రో చైర్మన్ నారాయణ, వీసీ కుమార్ మోలుగారం చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను అందుకుంది. రాగమాళికను ప్రిన్సిపాల్ గంగాధర్ అభినందించారు.

రాశిగుట్టతండాలో వైద్య శిబిరం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో వైద్యాధికారులు బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 57 మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎస్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాజీనామా చేశానని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం గ్రామానికి చెందిన బోడావత్ రవీందర్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతకాలంగా పార్టీలో తనను చిన్నచూపు చూడడంవల్ల పదవికి రాజీనామాచేశానన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా చంద్రయ్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల రేషన్ దుకాణం డీలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అందె చంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ బాబా, ప్రధానకార్యదర్శిగా శంకర్‌లు ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మధుసూదర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మీ, కోశాధికారిగా రాజులను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా శ్రీనివాస్, దుర్గయ్య, రేణుక, రాజేశ్వరిలు వ్యవహరించనున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో పలువురు డీలర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని జోగాపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రమాదేవి,మౌనిక, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కోనరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు కచ్చకాయల మహేష్ అన్నారు. మండలంలోని సుద్దాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సుమారు 15వేల విలువగల దుస్తులను ప్రధానోపాధ్యాయురాలు మంజులకు బుధవారం అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ ఎర్రవెల్లి విజయ్, ప్రజాప్రతినిధులు దొబ్బల ప్రవీణ్, వంగాల భూమేష్, సింగం నరేందర్, కాదాసు నర్సయ్య, పెరవెల్లి మహేందర్, డి. మధు, డి. నరేష్, రాములు, రామోజీ, సాయి, సుధీర్ ఉన్నారు.

శ్రావణ మాసంలో మల్లన్న బోనాలు

కోనరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న బోనాలను ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసం పురస్కరించుకొని మల్లన్న స్వామికి యాదవులు బోనాల పండుగను జరుపుకున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

చందుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మూడపల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ముస్తాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు తహసీల్దార్ సురేశ్ అందించారు. రైతు వేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో 77మంది యువతులకు చెక్కులను అందించారు. ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సయ్య, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, ఆగుల్ల రాజేశం, శీల ప్రశాంత్, తాళ్ల విజయ్‌రెడ్డి, ఎదునూరి భాను చందర్, మిరుదొడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

గంభీరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం-2ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ రజిత బుధవారం తనిఖీచేశారు. ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్‌లో అందించే ప్రజారోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల నమోదు, వారికి అందించే టీకాలపై 5 ఏళ్ళ పిల్లలకు అందించే టీకాలపై రికార్డులను పరిశీలించారు. పీవోఎం హెచ్ఎన్ డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సంపత్‌కుమార్, ఇన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వేణుగోపాల్ ఉన్నారు.

వెంకట్రావుపల్లెలో చోరీ..

ముస్తాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకట్రావుపల్లెలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు మడకంటి రాములు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఓ శుభాకార్యనికి వెళ్లి బుధవారం వచ్చి తాళం తీసి చూసేసరికి బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి వెనుక వైపు నుంచి వచ్చి బీరువా తాళాలు పగులగొట్టి నగదు రూ 50 వేలు, రెండు తులాల బంగారం, 20 తులాల వెండిని దొంగలు ఎత్తికెళ్లినట్లు బాధితులు లబోదిబోమన్నారు. ఎస్సై సీహెచ్ గణేశ్ ఘటన వివరాలను తెలుసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గంభీరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీకి సమీపాన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. కామారెడ్డి జిల్లా పల్వంచకు చెందిన వెంకటి తన ద్విచక్రవాహనంపై గంభీరావుపేట మండలం లింగాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. పెద్దమ్మ స్టేజీకి అతి సమీపాన మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వెంకటికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా, అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్, అగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తెలంగాణా తల్లి విగ్రహ కూడలిలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడుకి ఢీకొని తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కామారెడ్డి వైపు నుండి సిద్దిపేట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, ముస్తాబాద్‌కు చెందిన నాగసాని రాంచంద్రం(32) ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఢీకొనడంతో రాంచంద్రంకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రిలో చూపించగా కాలు విరిగినట్లుగా తెలుపడంతో సిద్దిపేటకు తరలించారు. ముస్తాబాద్ ఎస్సై గణేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.